# విపణి వీధి

-సి హెచ్. వి. బృందావనరావు

"ఈసారి జెడ్పీ చైర్మన్ గిరీ మన పార్టీ చేతులు దాటి పోవడానికి వీల్లేదు" అన్నాడు మాజీ ముఖ్యమంత్రి.

కరతాళ ధ్వనులు చేశారు అందరూ. ఆ పార్టీ జిల్లా సభ్యుల సమావేశం జరుగుతున్నది. త్వరలోనే మాజీలు కాబోతున్న సభ్యులూ, కొత్తగా సభ్యులు కాగోరుతున్న వారూ, చిన్నా పెద్దా నాయకులూ, జిల్లా ఇన్‌చార్జి నాయకుడూ- అందరూ వున్నారు సమావేశంలో. జిల్లాల వారీ ఎన్నికల ఎత్తుగడలూ, పొత్తులూ ఖరారు చేయించి సభ్యుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి త్వరలో జరగబోయే ఎన్నికలకు జనాన్ని ఉన్ముఖులను చెయ్యడానికి మాజీ ముఖ్యమంత్రి ప్రత్యేకంగా విచ్చేశారు.

ఒక టెరం అధికారాన్ని అనుభవించింతర్వాత, ఎన్నికల్లో ఓడిపోయి, పదవుల్లేక, పెత్తనం లేకపోవడం ఇబ్బందిగా వుండేది ఎవరికైనా. మంత్రుల లెవెల్లో, ఎమ్మెల్యే, ఎంపీల లెవెల్లో పదవులు పోయినా, స్థానికంగా వుండే ఛోటా నాయకులకు మాత్రం పదవులున్నా లేకపోయినా గ్రామాల్లో వాండ్ల అనుయాయులంటూ వుంటూనే వుంటారు. ఒకసారి ఎన్నికల్లో ఒకరు గెలిస్తే, మరోసారి మరొకరు గెలిచినా ఊళ్లల్లో జనం మీద వాండ్ల వాండ్ల పట్టు వాండ్లకు వుంటూనే వుంటుంది.

"మీ అందరికీ తెలిసిన సంగతే గదా, జిల్లాపరిషత్ చైర్మన్ మనవాడు రావాలంటే జెడ్పీటీసీ సభ్యులుగా మనవాళ్లు ఎక్కువ మంది గెలవాల. ఇప్పుడు రాష్ట్రం లెవెల్లో అధికారం మనది గాదు. ఇప్పటి ముఖ్యమంత్రి ఎన్ని ఎత్తులైనా వెయ్యగల సమర్థుడు. ఎంత ఘోరమైనా చెయ్యించగల కర్కోటకుడు. తిమ్మిని బమ్మీ, బమ్మిని తిమ్మీ చేయగలడు. అంతేగాదు. డబ్బులు కుమ్మరించడంలో అఖండుడు. నీతీ నిజాయితీ లేనే లేవు అతనికి" అన్నారు మాజీ ముఖ్యమంత్రివర్యులు.

"అప్పటికి అవన్నీ మనకుండి ఏడ్చినట్లు" పక్కనున్న సుబ్బరాజుకు తప్ప మరొకరికి వినిపించకుండా అన్నాడు వెనక లైన్లో కూచున్న వెంకటస్వామిరెడ్డి.

''యంకటస్వామన్నా, ఏందో అంటున్నావు'' చిరునవ్వుతో అడిగాడు నాయకుడు.

ఏమీ తొణక్కుండా "ఏముంది సార్, ఆయన డబ్బులు కుమ్మరించేట్లయితే మనమేనా చాతకాక కూచుంది. రాజకీయాలు డబ్బుల్లేకుండానే నడుస్తయా. పెట్టాల్సొస్తే మనమూ పెట్టలేమా వాళ్లకంటే ఎక్కువే" అన్నాడు వెంకటస్వామిరెడ్డి.

"వెరీ గుడ్. అదీ స్పిరిటంటే. మనం ఆవిధంగా ముందుకుబోవాలన్నమాట. ఇంతకీ ఈ జిల్లాలో జెడ్పీటీసీ మెంబర్లుగా ఎవరెవరు నిలబడాలనుకుంటున్నారో చెప్పండి" అన్నాడు నాయకుడు.

జిల్లాలో వుండే అరవైమూడు స్థానాలకూ దాదాపు నూటయాభై, రెండొందలు చేతులు పైకి లేచినై.

"ఇంతమందితోని సమీక్షించాలంటే కష్టమౌతుంది. ఏ స్థానానికి ఆ స్థానంగా చూసుకుంటే సులభంగా వుంటది" అన్నాడు జిల్లా ఇన్‌చార్జి నాయకుడు.

"అదెట్ల గుదురుద్ది. ఏ మండలం వాండ్లు ఆ మండలానికే పోటీ చెయ్యాలని ఏమీ లేదు గదా. నా కులం వాండ్లు పక్క మండలంలో ఎక్కువ మంది వున్నారు. నాకు ఆడైతేనే సులువు. ఎవుడైనా, ఎక్కడైనా పోటీజెయ్యొచ్చు. కాకపోతే మోటుకోవడానికి డబ్బూ, దన్నూ వుండాలగాని" అన్నాడు ఒక ఛోటా లీడరు.

"మనం అధికారంలో వున్నప్పుడు రాజ్యసభ సభ్యులుగా రాష్ట్రం మనిషిని వేరే రాష్ట్రంలో ఎన్నిక చేయించారని ఆ పార్టీని విమర్శించాం గదా. మరి మనమే ఆ పని చెయ్యొచ్చా" అన్నాడు ఒకాయన.

"మనదంటే ప్రాంతీయ పార్టీ గదా. మన పార్టీ వాండ్లు ఇతర రాష్ట్రాలలో వుండరు గాబట్టి అట్లా అన్నాం. కానీ లోకల్ ఎన్నికల్లో కూడ అట్ల చెయ్యగూడదంటే ఎట్ల గుదురుద్ది?" అన్నాడు మొదటి లీడరు.

ఈ వాద ప్రతివాదాన్ని చిరునవ్వుతో వింటూ ఉండిపోయాడు నాయకుడు.

జిల్లా ఇన్‌చార్జి నాయకుడు ప్రారంభించాడు. "సరేనయ్యా, అవ్వన్నీ అట్లా వుంచండి. ఎవరికైనా మన పార్టీ టిక్కెట్టు రావాలంటే వాండ్లు అన్నివిధాలా సమర్థులై వుండాలి. అందర్నీ కలుపుకు పోగలిగి వుండాలి. నీ కులం వాండ్ల ఒక్క వోటూ అవతలి వాండ్లకు పోకుండా చూసుకోవాలి. అన్నిట్నీ మించి ఖర్చుకు తట్టుకోగలిగి వుండాలి. ఖర్చు కోట్లల్లో వుంటుంది తెలుసుగదా" అని ఆగాడు.

"కోట్లా" నోళ్లు వెళ్లబెట్టారు అయిదారుగురు.

''అవునయ్యా కోట్లే. లక్షలు ఎప్పుడో దాటిపోయినాయి. జనం గూడ తెలివిమీరిపోయిన్రు గదా. డబ్బుల్లేకుండా ఓట్లేస్తారా? ప్రచారానికీ గావాల- ఈటన్నిటికీ డబ్బులు గావాలంటే లక్షలేడ సరిపోతాయి. మీరందరూ ఎలక్షన్లల్లో నలిగిన వాండ్లే గదా. మీకు తెలియందేముంది" అన్నాడు జిల్లా ఇన్‌చార్జి నాయకుడు.

"నియోజకవర్గానికి ఇంత అని పార్టీ ఫండుంటది గదా"- అనుమానం వెలిబుచ్చాడు ఓ ఔత్సాహికుడు.

"ఆ ఆశేం పెట్టుకోకండి. ఇప్పుడు మనం అధికారంలో లేం అనే సంగతి మరిచిపోతే ఎట్లా? ప్రభుత్వప్పనుల డబ్బుల్ను లోపాయకారీగా పార్టీకీ, ఎలక్షన్లకూ ఇప్పుడు మళ్లించలేం గదా. అదట్లా వుంటే, ఎవురికి పార్టీ టిక్కెట్టు వస్తదో వాండ్లు పార్టీ ఫండుకని కొంత ఇవ్వాల. మనకు ఈ ఒక్క జిల్లాగాదు మరి. మాట వరసకు, పక్క జిల్లా వుంది. అక్కడ మనవాండ్లు కొంచెం వీక్‌గా వున్నారు. వాండ్లకు పార్టీ సాయపడాల్నా వద్దా. అందుకని పార్టీకి ఘనంగా ఇవ్వగలిగితేనే మీరు టిక్కెట్టు ఆశించండి" అన్నాడు నాయకుడు.

"డబ్బుకు ఎనక్కు తగ్గేదే లేదు చౌదరిగారూ. అసలు మన పార్టీ ఈ జిల్లాలో గెలిచి తీరాల. నా మండలంలో ఆళ్ల పార్టీకి డిపాజిటు వస్తే నేను మీసం దియ్యించుకుంటా" అన్నాడు వెంకటస్వామిరెడ్డి.

"అదంతే చౌదరీ. యెంకటస్వామిరెడ్డి నిల్చునే కాడా, నేను నిల్చునేకాడా ఆ పార్టీ వోండ్లకు పుట్టగతుల్లేకుండా చెయ్యకపోతే మేమసలు రాజకీయాలే మానుకోమా" అన్నాడు సుబ్బరాజు.

సుబ్బరాజూ, వెంకటస్వామిరెడ్డీ మంచి స్నేహితులు. వాండ్లిద్దరికీ అధికార పార్టీ మీద ఒక కామన్ కసి వుంది. ఆ పార్టీ ఇద్దర్నీ మోసం చేసింది. పదేండ్ల కిందట ఎన్నికల్లో వాండ్ల వాండ్ల నియోజకవర్గాల్లో వాండ్లకు టిక్కెట్లు ఇస్తామని ఆశపెట్టి చివరకు ఇవ్వకపోవడమే గాక వాండ్ల బద్ధ విరోధులకు టిక్కెట్లు ఇచ్చింది. అప్పటినుంచీ వాండ్ల విరోధులు బలపడటం, మొదటి నుంచీ ఏకచ్ఛత్రాధిపత్యంగా వున్న వాండ్ల పెత్తనానికి బీటలు వారడం జరిగింది. అందుకని ఆ పార్టీ అంటే వాండ్లకు విపరీతమైన మంట. ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ ప్రతిపక్ష పార్టీ టిక్కెట్టు సంపాదించి అధికార పార్టీని తమ నియోజకవర్గాల్లో తుడిచిపెట్టాలనే పట్టుదలతో వున్నారు.

మొత్తానికి వెంకటస్వామిరెడ్డీ, సుబ్బరాజూ వాండ్ల నియోజకవర్గాలకు ప్రతిపక్ష పార్టీ టిక్కెట్లు సంపాదించగలిగారు. టిక్కెట్ల వరకే బాగా డబ్బు ఖర్చయింది. ఎలక్షన్లో దిగింతర్వాత ఖర్చుకు భయపడితే కుదరదు గదా. ఎన్నికలు ఖర్చయ్యే నాటికి ఇంకెంత ఖర్చయినా మోటుకోటానికి సిద్ధంగా వున్నారు వాండ్లిద్దరూ.

❖ ❖ ❖

వెంకటస్వామి రెడ్డి మంచి మెరికల్లాంటి కొంతమంది యువకులను దగ్గరికి తీసి వుంచాడు. ఆ యువకులు బాగా చదువుకున్న వారు. నోటి బలం వున్నవారు. చక్కగా ఉపన్యాసాలు చెప్పగలవారు. వాండ్లకూ అధికార పార్టీ అంటే వ్యతిరేకత బాగా వుంది. వాండ్ల తెలివి తేటల్నూ, అధికార పార్టీ వ్యతిరేకతనూ జాగ్రత్తగా వుపయోగించుకుంటాడు వెంకటస్వామిరెడ్డి.

ఎన్నికలు దగ్గరికి వచ్చాయి. అధికార పార్టీ అభ్యర్థి తెలివిగా వెంకటస్వామి అనుచరుల ఓట్లను ఓటర్ల లిస్టులో లేకుండా చేయించాడు. ఆ వ్యవహారం మీద రెడ్డీ, అతని అనుచరులూ బాగా గోల చేశారు. రాస్తారోకోలూ, ఆఫీసుల ముందు ధర్నాలూ నిర్వహించారు. ఏం చేసినా అది ఇంక ప్రయోజనం లేని పోరాటమే అయిపోయింది. చేసేది లేక తమ పోరాటాన్ని విరమించుకున్నారు. వెంకటస్వామిరెడ్డి మాత్రం క్రుంగిపోక అవతలి పార్టీ వాండ్ల ఓట్లను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేశాడు.

ఎన్నికల రోజు సర్వశక్తులూ ఒడ్డి ప్రయత్నించాడు వెంకటస్వామిరెడ్డి. మందుబాబులకు మందూ, డబ్బుకు డబ్బూ వెదజల్లాడు. అతని అనుచరులైన యువకులు తమకు ఓట్లు లేకపోయినా బాగా జనాన్నీ, ఓట్లనూ సమీకరించి వెంకటస్వామిరెడ్డికి బాగా సహాయం చేశారు. ఒక్కొక్క ఓటుకు వందలాది రూపాయలు పోసి ఓట్లు కొన్నాడు రెడ్డి. పిల్లల తలల మీద చేతులు పెట్టించి ఓటర్ల చేత ప్రమాణాలు చేయించుకున్నాడు. అతని ప్రత్యర్థి కూడా చాలా శ్రమించాడు.

ఎన్నికల ఫలితాలు వచ్చాయి. వెంకటస్వామిరెడ్డి

మంచి మెజారిటీతో గెలిచాడు. పక్క నియోజకవర్గంలో సుబ్బరాజు కూడా గెలిచాడు. రెడ్డి, రాజుల అనుచరులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఊరేగింపులు తీశారు. పార్టీలు చేసుకున్నారు.

"ప్రజాస్వామ్యం గెలిచింది" అన్నాడు వెంకటస్వామి రెడ్డి. "అధికార పార్టీ ఇవ్వజూపిన అన్ని ప్రలోభాలనూ తిరస్కరించి నీతికి నిలబడ్డ ప్రజలను అభినందిస్తున్నాను" అన్నాడు.

"డబ్బూ, మందూ ఈ ఎన్నికల్లో చూపిన ప్రభావం నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూళ్లేదు" అన్నాడు ఓడిన అభ్యర్థి. ఆ రెంటినీ తన శాయశక్తులా పంచినా ఫలితం రాబట్టుకోలేని ఆ అభ్యర్థి. "అయినా నైతిక విజయం మాదే" అని గంభీరంగా ఉద్ఘోషించాడు.

ఆ జిల్లాలో అధికార పార్టీకన్నా ప్రతిపక్ష పార్టీకే ఎక్కువ సీట్లు వచ్చాయి. అధికార పక్షానికి జిల్లాపరిషత్ చైర్మన్ పదవి దక్కదని తేలిపోయింది. రాష్ట్ర నాయకుడూ, జిల్లా ఇన్‌చార్జి నాయకుడూ మబ్బుల్లో తేలిపోతూ ప్రకటనలు గుప్పిస్తున్నారు.

"జిల్లాలో అధికార పార్టీని తలెత్తుకోకుండా చెయ్యాల" అని శపథాలు చేసుకుంటున్నారు రెడ్డి, రాజుల అనుచరులు.

❖ ❖ ❖

జిల్లాలో మొత్తం జెడ్పీటీసీ సభ్యుల సంఖ్య అరవై మూడు. రాష్ట్రంలో అధికారంలో వున్న పార్టీకి ముప్పై సీట్లు, ప్రతిపక్ష పార్టీకి ముప్పైమూడు సీట్లూ వచ్చాయి. అధికార పార్టీ జెడ్పీ మీద ఆశలు వదులుకున్నది. ప్రతిపక్ష పార్టీకి ఆ జిల్లాలో పట్టపగ్గాలు లేకుండా వున్నాయి. రెండు పార్టీల వాండ్లు వాండ్ల వాండ్ల సభ్యుల్ను తీసుకొని ఒకరు గోవాలోనూ, ఇంకొకరు ఊటీలోనూ క్యాంపులు పెట్టారు. సభ్యులకు సకల సదుపాయాలూ సమకూరుస్తున్నారు. టీవీ వాండ్లకు ఇంటర్వ్యూలిస్తున్నారు.

ఎలక్షన్ రేపనగా ఎ/సి డీలక్స్ బస్సుల్లో అందరు సభ్యులూ జిల్లా ముఖ్య పట్టణానికి చేరుకున్నారు.

❖ ❖ ❖

చైర్మన్ ఎన్నిక జరిగే కలెక్టరు ఆఫీసు చుట్టూ 144 సెక్షను పెట్టారు. రెండు పార్టీల అభిమానులూ ఆఫీసు ఆవరణకు దూరంగా, 144 సెక్షన్ అమలులేని ఏరియాలో మూగి వున్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన వారు వాండ్ల పార్టీ ఎలాగైనా గెలిచి తీరుతుందని తెలుసు కాబట్టి బాణాసంచా తెచ్చుకుందామనుకున్నారు. కాని పోలీసులు నిషేధించడంతో వారి ఉత్సాహానికి నీళ్లు చల్లినట్లయింది. ఫలితం అందరికీ తెలిసిందనే ఉద్దేశంతో జనమంతా నలుగురైదుగురు జట్లు జట్లుగా ఏర్పడి చెట్ల కింద, టీ దుకాణాల దగ్గరా దాన్ని గురించే చర్చించుకుంటున్నారు. ఉదయం పదకొండు గంటల నించీ ఇదేతంతు కొనసాగుతున్నది. లోపల ఏం జరుగుతున్నదో తెలీడం లేదు. ఎన్నిక మళ్లీ సాయంకాలానికి వాయిదా పడిందని పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా తెలిపారు. కానీ సభ్యులెవరూ బయటికి రాలేదు.

మధ్యాహ్నం నాలుగ్గంటలైంది. ఎన్నిక ఫలితం ఇక ప్రకటిస్తారని అనుకుంటుండగానే మైక్‌లో ప్రకటన విన్పించింది.

"అధికార పార్టీ అభ్యర్థి రాజభూషణరెడ్డి జెడ్‌పి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి సుందరయ్య చౌదరి మీద ఒక్క ఓటు మెజారిటీతో గెలుపు సాధించారు" అని.

ఈ విచిత్రం ఎట్లా జరిగిందో జనానికి అర్థం కాలేదు. ప్రతిపక్ష పార్టీ సభ్యులు ముఖం గంటుపెట్టుకొని "ముఖ్యమంత్రి డౌన్ డౌన్" "కుల రాజకీయాలు డౌన్ డౌన్" అని అరుచుకుంటూ బయటికి వస్తున్నారు. బయట ప్రతిపక్ష పార్టీ నాయకుల అనుచరులు చెలరేగిపోయి షాపులు ధ్వంసం చేయడం లాంటి పనులకు పూనుకోబోగానే పోలీసులు కల్పించుకొని సర్దుబాటు చేశారు.

చివరకు తెలిసిన నిజం ఏమిటంటే అధికార పార్టీని భూస్థాపితంజేస్తాం, మీసాలు గొరిగించుకుంటాం, రాజకీయాల్లోంచి విరమిస్తాం అంటూ వీరలెవెల్లో వాదించిన వెంకటస్వామిరెడ్డి, సుబ్బరాజూ ఆఖరి క్షణాల్లో ప్లేటు ఫిరాయించి అధికార పార్టీలో చేరిపోయి ఆ పార్టీ అభ్యర్థికి ఓటు వేశారు.

"ఈ ఫిరాయింపుల రాజకీయం నశించాలి. డబ్బుల్తో సభ్యులను కొనే సంస్కృతిని ముఖ్యమంత్రి పెంచి పోషిస్తున్నాడు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. ప్రజలు ఇదంతా గమనిస్తూనే వున్నారు. దీన్ని క్షమించరు" అని ప్రతిపక్ష పార్టీ నేత–

"మా పార్టీ అనుసరిస్తున్న పురోగామి విధానాలకు ఆకర్షితులై మా పార్టీలోకి వచ్చిన సభ్యులకు మేం స్వాగతం పలుకుతున్నాం. దీనికి ప్రతిపక్షాలు గొంతు చించుకోవడం చూస్తుంటే వీరికి వ్యక్తి స్వాతంత్ర్యం మీదా, భావ ప్రకటనా స్వేచ్ఛ మీదా అసలు విశ్వాసం వున్నదా అని అనుమానం కలుగుతున్నది" అని ముఖ్యమంత్రి గారూ రాష్ట్ర రాజధాని నుంచి వేర్వేరు ప్రకటనలు జారీచేశారు.

❖ ❖ ❖

వెంకటస్వామిరెడ్డి వారం రోజుల తర్వాత తన వూరికి చేరగానే అతని అనుయాయులు అతనికి బ్రహ్మరథం పట్టారు. అతని అనుచరులంతా అప్పటిదాకా ప్రతిపక్ష పార్టీలో వున్నా తమ నాయకుడు అధికార పార్టీలో చేరగానే వాళ్లూ ఆయనతోపాటు అధికార పార్టీలో చేరినట్టే. తమ పార్టీ అభ్యర్థే జిల్లాపరిషత్ చైర్మనైనప్పటికీ, తన వ్యతిరేకికి ప్రాముఖ్యం వచ్చినందువల్ల అప్పటిదాకా అధికార పార్టీకి చెందిన నాయకుడూ, అతని అనుచరులూ మాత్రం విజయోత్సవాల్లో పాల్గొనడం గానీ, వెంకటస్వామిరెడ్డిని అభినందించడం గానీ చేయలేదు. అతను తన అనుచరులతో ప్రతిపక్ష పార్టీలో చేరే ప్రయత్నంలో వున్నాడని పుకార్లు వినవస్తున్నాయి.

"ఈ పుకార్లన్నీ అబద్ధాలు. నేను క్రమశిక్షణ గల పార్టీ సైనికుణ్ణి. జిల్లాలో మా పార్టీ గెలిచినందుకు ఎంతో ఆనందపడుతున్నాను" అని శనివారం సాయంత్రం తన వూళ్లో స్టేటుమెంటు ఇచ్చి సోమవారం పొద్దున్నే హైదరాబాదు పోయి ప్రతిపక్ష పార్టీలోకి చేరిపోయాడు ఆయన.

"ఆ పార్టీ కుల రాజకీయాలతో, ధన రాజకీయాలతో భ్రష్టుపట్టిపోయింది. ఇన్నాళ్లుగా ఆ పార్టీలో వున్నా ఊపిరాడని ఉక్కతో మగ్గిపోతూనే వున్నాను. ఇప్పుడు నా స్వంత ఇంట్లోకి వచ్చినట్లున్నది" అని మరో స్టేటుమెంటు టి.వి. కెమెరాల ఎదురుగా ఇచ్చాడు.

❖ ❖ ❖

వెంకటస్వామిరెడ్డిని నమ్ముకొని, రాజకీయాల్లో నిజాయితీని ఆశిస్తున్న విద్యావంతులైన యువకులు, రెడ్డి చేరదీసినవారు ఏడెనిమిది మందికి ఈ పద్ధతేం నచ్చలేదు. అప్పటిదాకా అధికార పార్టీని తిట్టి దాన్ని భూస్థాపితం చేస్తానని శపథాలు చేసి ప్రతిపక్ష పార్టీ అభ్యర్థిగా నిల్చుని, ఆ పార్టీ జనం ఓట్లేస్తే గెలిచి, ఆఖరి నిముషంలో ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచి అధికార పార్టీలో చేరిపోయిన వెంకటస్వామిరెడ్డంటే వాండ్లకు కోపం వచ్చింది. మరీ ఇంత ఛండాలమా అని అసహ్యమూ వేసింది.

"నువ్వు చేసిన పని ఏమీ బాగాలేదన్నా" అని ఆయన మొహం ముందే అడిగేశారు.

"నేనేం జేసినానురా" అన్నాడు రెడ్డి.

"నువ్వు పార్టీ ఫిరాయించడానికి లక్షల్లక్షలు డబ్బులు తీసుకున్నావని జనమంతా అనుకుంటున్నారన్నా"

రెడ్డి చిరునవ్వు నవ్వాడు. జవాబు మాత్రం చెప్పలేదు.

"నువ్వేన్నన్నా చెప్పు. ఇట్లా జనానికి ద్రోహం చేయడం ఏం బాగాలేదన్నా" అన్నాడో యువకుడు.

"ఏందిరో పెద్ద మాటలు మాట్టాడతుండావు. నేనేంది

## హైకూలు

ఎవరు జల్లారో
ఎగిరే నక్షత్రాలని
అటూ ఇటూ మిణుగురులు

చెట్టుమీద
రెక్కల రెపరెపలు
విరామానికో వలసకోసమో

పూల తోటలో కెళ్ళాం
మా పిల్లలు
సీతాకోకలయ్యారు

రోడ్డంతా
సన్న అరుపుల ప్రవాహం
రేపు స్కూలుకి సెలవట

## నానీలు

విత్తనం రాలి
భూమికి కృతజ్ఞత చెప్పింది
మళ్ళీ మళ్ళీ
పచ్చగా మొలకెత్తాలని

మొగ్గ
పువ్వుగా మారింది
కొమ్మ
జన్మధన్యమైంది

ఆమెతో మాట్లాడం
నాకెంతో ఇష్టం
దోసిళ్ళతో
రత్నాలేరుకోవచ్చని

డాబామీద
పడుకున్నాను
చీకటి దుప్పటి
ముసుగేసుకుని

–పి. ఆర్. ఎల్. స్వామి

ద్రోహం జెయ్యడమేంది. నేనెవరికి ద్రోహం చేసినానురా" అన్నాడు రెడ్డి.

"నువ్వు ఒక పార్టీ వాండ్ల ఓట్లతో గెలిచి ఇంకో పార్టీలో చేరడం అంటే ఓటర్లందరికీ ద్రోహం చెయ్యడం గాదా" అన్నాడో యువకుడు.

"ఏందీ? అది ద్రోహం ఎట్లా అవుద్ది? నన్ను ఇదే పార్టీలో వుండమని గాని, అవతలి పార్టీలో చేరొద్దని గానీ ఏ ఓటరూ నన్ను కోరలేదు, నేను వాండ్లకు మాటి య్యాలేదు. పాపం వాండ్లకు ఈ పార్టీలూ, రాజకీయాలూ ఇన్నేందెలుసున్రా. నాకు వోట్లుగావాల. వాండ్లకు డబ్బులు గావాల. ఓటుకింత అని ప్రతివాడికీ డబ్బులు పంచినా. ఇదే సమయమని వోటర్లు గూడ వాండ్ల రేటును పెంచి నారు. చచ్చినట్లు వాండ్లందరికీ పెంచిన రేట్ ఇచ్చినా. తాగినోళ్లందరికీ సారాకు సారా, కల్లుకు కల్లూ బోయించినా. కొంతమంది బ్రాందీలూ ఇస్కీలూ గావా లంటే కేసులక్కేసులు దెప్పించి యాదికో కేసు లెక్కన బంచినా. మా ఆడోల్లు ఇంటింటికీ దిరిగి ఆడోల్లందరికీ బొట్లు పెట్టి ఇంటికో స్టీలు బిందె పంచొచ్చిరి. లేబరోండ్ల ఆడోల్లకు స్టీలు బిందెల్తోపాటు చీరలూ, రవికలూ ఇచ్చొచ్చిరి. రెండు మూడు గ్రాముల బంగారంతో మంగళ సూత్రాలు జేయించి కొంతమంది ఆడోల్లకు పంచి పెట్టిస్తి. కొంతమంది ఆడోల్ల పిల్లోళ్లనూ, మొగుళ్లనూ వొదిలి ఆ పదిరోజులూ నా జీపులో ఎక్కి ఊళ్లో ఆడోళ్లల్లో ప్రచారం చేసినందుకు ఏడెనిమిది నెక్లెసులు కర్చాయ. అసలు నాకు టిక్కెట్టు రావడానికి ఎంత కర్చయిందో తెలుసా? పొద్దుల్లేస్తే నీతికథలు చెప్పే పెద్ద పెద్ద నాయకులకూ, వాండ్లకూ మాకూ మధ్య బ్రోకరు పనిజేసే జిల్లా ఇన్‌చార్జి లీడర్లకూ వాండ్ల వాటా వాండ్లకు ముట్టకపోతే నాకు టిక్కెట్టొచ్చేదా? మరి ఇన్ని లక్షలు ఖర్చుచేసుకొని రాజకీయాల్లో నిలబడాలంటే– నేనేం ప్రకాశం పంతుల్ననుకుంటున్నారా ఏందిరా? ఇంట్లోంచి తీసుకపోయి నేను కర్చుపెట్టిన ఈ డబ్బంతా, అధికారం లేని పార్టీతో అంటకాగితే ఎట్లా వొచ్చుద్ది?– మీరంతా నా వాళ్లుగాబట్టి ఈ సంగతులన్నీ చెప్పగూడని వైనా, మీకు జెబ్తున్నాగాని, అసలు దేశంలో ఈ దందా జెయ్యకుండా పదవిలోకొచ్చిన వాడు ఒక్కడి పేరు జెప్పండి" అని తన రాజకీయ విశ్వరూపాన్ని స్పష్టంగా ప్రదర్శించాడు వెంకటస్వామిరెడ్డి.

"కానీ ఓటర్లు మిమ్మల్ని క్షమించరు. నిన్ను నిల దీస్తారు" అన్నాడు మరో యువకుడు.

"ఓరి పిచ్చోడా! ఓటర్లు వోటర్లని ఒకటే వొర్లుతు న్నారు. ఎవుర్రా ఈ వోటర్లు. ఏ వోటరైతే డబ్బుల్దీసుకొని వోటేస్తాడో, మందుకూ విందుకూ కక్కుర్తిపడి వోటేస్తాడో– ఆ వోటరుకు నోరు తెరిచే హక్కు లేదు. డబ్బుల్దీసు కున్నారు– ఓటేసినారు. ఆ లావాదేవీ అంతటితో చెల్లు. ఈ వోటర్ల సంగతి మీ కంటే నాకు బాగా దెలుసుగాని మీరేం ఆయాసపడకండి. అన్నట్టారే మీకు ఉద్యోగం సద్యోగం లేకపోతే ఇట్టాంటి ఆలోచనలే వొస్తుంటాయి గాని, ఇప్పుడు మన పార్టీ పెత్తనంలో వుంది గదా, చిన్నదో పెద్దదో ఒక ఉద్యోగం వేయిస్తాగాని రేపు హైదరా బాదు పోతుండా మీ సర్టిఫికేట్లు దీస్కొని రండి. ఏదన్నా ప్రయత్నం జేద్దాం. అన్నట్టు ఇంట్లో వాండ్లనడిగి కాస్తో కూస్తో డబ్బుల్దీసకరండి– కర్చులగ్గావాలగదా" అని లేచాడు వెంకటస్వామిరెడ్డి. ■

# అందని ఆకాశం

**-కె.వాసవదత్త రమణ**

అటెండరు తలుపు తీసుకుని వినయంగా ఫైల్సు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు!

సుమలత ఒక్కొక్క ఫైలు తీసి స్టడీ చేయడం మొదలు పెట్టింది. "మేడమ్! ఉద్యోగంలో చేరిన మొదటి రోజూ సీరియస్‌గా పని మొదలుపెట్టేసారు!" అటెండరు మన సులో అనుకుంటూ బయటకు వెళ్లాడు!

ఇంతలో ఫోను మోగింది! ఫోను మాట్లాడుతూ బజర్ నొక్కింది సుమలత!

"ఆ అయిపోయిందీ? టెండర్ ఫైనల్ చేశాం!" మాట్లాడుతూనే అటెండరు లోపలికి రాగానే ఫైల్సు పట్టు కెళ్లమని సైగ చేసింది!

టేబిల్ క్లియర్‌గా ఉంటేనే ఆమెకిష్టం! వర్కు పెండింగ్ ఉంటే ఆమెకు నచ్చదు! చాలా 'డిసిప్లేన్ ఆఫీసురు'గా ఆమెకు మంచి రికార్డు ఉంది!

"అరే! ఈ ఫైలు చూడలేదే!" అనుకుంటూ ఓ పక్కగా ఉన్న ఫైలు చేతుల్లోకి తీసుకుంది సుమలత!

ముత్యాల్లాంటి అక్షరాలు, అవే అక్షరాలు, అదే వ్రాత! ఆమె గుండె వేగంగా కొట్టుకుంది! ఆ అక్షరాల వెంట ఆమె కళ్లు రేసు గుర్రాల్లా పరుగుతీసాయి! ఆమె మనస్సంతా ఉద్వేగంగా, ఉద్రేకంగా మారింది!

"నన్ను నేను మరచిపోగలను కాని, ఆ అక్షరాలని, ఆ అక్షరాలకి రూపం ఇచ్చిన ఆ మనిషిని ఎప్పటికయినా మర్చిపోగలనా!" బేలగా ప్రశ్నించుకుంది తన మనుసు!

కళ్లలోకి తెలియకుండానే చెమ్మ చేరింది! చాలా సేపటివరకు అచేతనంగా అలాగే కూర్చుండి పోయింది. మళ్లీ నమ్మకం కుదరక కింద సంతకం వంక చూసింది! అదే సంతకం!

ఒక్క పది నిముషాలకి తేరుకుని, యాంటీ రూమ్ లోకి వెళ్లి రిలాక్స్ అయ్యింది, ముఖం కడుక్కుని!

మళ్లీ వచ్చి తన రూమ్‌లో కూర్చుంది! పది నిమిషాల క్రితం టీనేజి పిల్లల్లా తను పడ్డ టెన్షను గుర్తుకు వచ్చి ఆమె పెదాలపై చిరునవ్వు విరిసింది!

"రఘు!" ఆ ఫైలు మీద సంతకం మీద ఆమె వేళ్లు కదలాడుతుంటే ఆమె మనస్సు గతంలోకి పరుగు తీసింది!

❖ ❖ ❖

"రఘు!" వెన్నెల్లాంటి చిరునవ్వుతో సుమలత పరుగెత్తుకుంటూ వచ్చింది.

"రఘు!" నేను టెన్తు ఫస్టు క్లాసులో పాసయ్యాను! ఆమె కళ్లలో ఆనందపు మెరుపులు!

"అబ్బా! దానికేనే ఇంత హడావుడి" రఘు వెక్కి రింతగా అన్నాడు! ఆమె ముఖం చిన్నపోయింది.

"నువ్వెప్పుడు ఇంతే! ఎవ్వరికి చెప్పకుండా నీకే మొదటగా చెబుదామని వస్తే...!" కోపం తన్నుకొచ్చింది సుమకి!

"జయ! సుమా! ఓకే! కంగ్రాట్స్! సరేనా!" నవ్వుతూ అన్నాడు!

అతని నవ్వుని, మెరుస్తున్న పలు వరస వంక అలాగే చూస్తూ ఉండిపోవాలనిపించింది సుమకి!

"సుమ! సాయంత్రం సినిమాకి! పార్టీ ఇస్తావా మరి!" అంటూ బుగ్గలు పట్టుకుని సాగతీసాడు!

కళ్లెత్తి చూసి నవ్వి, అతని చేతులు మృదువుగా విడిపించుకుని 'అలాగే' అంటూ పరుగెత్తింది!

"ఏమిటో, సుమ దగ్గరున్నంత సేపు కవ్వించాలని, బాగా ఏడిపించాలని అనిపిస్తుంది, తను బాధపడి వెళ్లిపోతే మళ్లీ మనస్సంతా శూన్యంగా అనిపిస్తుంది!" అనుకున్నాడు రఘు!

ఇద్దరివీ పక్క పక్క ఇళ్లు కావడంతో – కలిసే పెరిగారు! రఘు నలుగురు ఆడపిల్లల తర్వాత పుట్టడం వల్ల అతనంటే ఇంట్లో అందరికీ అపురూపం! మగ పిల్లాడని అమిత గారం!

"నీకేంరా మగ మహారాజువి" అనే భావంతో – అందరూ అదే అనడంతో బలపడి అతనిలో తెలియ కుండానే పురుషాహంకారం అప్పుడప్పుడు స్పష్టంగానే బయటపడుతుంది!

❖ ❖ ❖

ఎర్రటి లంగా, జాకెట్టు, తెల్లటి ఓణిలో మెరిసి పోతున్న సుమని పదేపదే చూడాలనిపిస్తూనే ఉంది, రఘుకి సినిమాకి వెళ్లేవరకు!

థియేటర్ దగ్గర సుమలత ఫ్రెండ్స్ రాణి, శ్రీధర్, గోపాల్ కనిపించడంతో అతనిలో చిరాకు మొదలైంది.

సుమలత ఫ్రెండ్స్ అందరితో కబుర్లు చెబుతూ సినిమా ఎంజాయి చేసింది. రఘు గంటుముఖం పెట్టు కునే సినిమా చూశాడు! సుమ రెండు మూడుసార్లు పలకరించినా పలకలేదు. ఆమెకి అతని జెలసీ, కోపం అన్నీ తెలుస్తూనే ఉన్నాయి!

సినిమా అవ్వగానే అందరు ఎవ్వరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు!

"రఘు! ఎందుకు కోపం! వాళ్లు నాకు ఫ్రెండ్స్ కదా!" అనునయంగా అందామె ఇంటికి దగ్గరగా వచ్చాక!

"అవును! నీకు అందరూ ఒక్కటే కదా!" విసురుగా అన్నాడు!

"సిల్లీగా మాట్లాడుతున్నావు!"

"సుమ! ఇంకెప్పుడు నన్నిలాంటి ప్రోగ్రామ్స్ పెట్టి పిలవకు!"

కఠినంగా అన్నాడు.

ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి!

"రఘు నీకెలా చెప్పాలి! నన్ను, నా మనస్సును ఎప్పుడు గ్రహించుకుని గెలుచుకుంటావు? ఎప్పుడు నీలో అభిజాత్యాన్ని పక్కకు పెట్టి నన్ను గుర్తిస్తావు!"

రఘు ప్రవర్తన ఆమెను బాగా గాయపర్చింది!

విడిపోయే ముందు, రఘు హఠాత్తుగా సుమకేసి తిరిగి, "సుమ! ఒక్కటి గుర్తుపెట్టుకో! ఈ ప్రపంచంలో నేను ఇష్టపడినట్టు ఇంకెవ్వరు – నిన్ను ఇష్టపడరు! అందరిలోను నన్నెప్పుడు కలపకు! బై!" ఇంట్లోకి వెళ్లి పోయాడు!

అతని మాటలకు ఆమెలో గూడు కట్టుకున్న బాధ తగ్గినట్టనిపించింది! చిరునవ్వుతో అతను వెళ్లిన వంకే చూస్తుండిపోయింది అతని రూపం కనుమరుగయ్యే